క్లుప్తంగా

ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభం



క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రసాద్‌నాయుడు

కావలి: దగదర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా మహిళ విభాగంలో కబడ్డీ పోటీలను దగదర్తి ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు ప్రారంభించారు. గ్రామీణ స్థాయిలోని క్రీడా కారులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి జగనన్న ఈ కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో తడకలూరు సర్పంచ్ గిరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ తనిఖీ



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

కొండాపురం: మండలంలోని సాయిపేట, నేకునాంపేట, గుడవళ్లూరు సచివాలయాలను కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి శుక్రవారం తనిఖీ చేశారు. నేకునాంపేట సచివాలయంలో ఎంపీఈఓ, పశు వైద్యశాఖ సిబ్బంది సచివాలయంలో లేకపోవడంతో వారికి వెంటనే మెమోలు జారీ చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ శేషసాయిని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. అనంతరం రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని, పాస్ బుక్‌లు పెండింగ్ లేకుండా చూడాలని తహశీల్దార్ శ్రీనివాసులకు సూచించారు.

వైఎస్సార్ ధ్యాన మందిర నిర్మాణం బాగుంది



వైఎస్సార్ ధ్యాన మందిరాన్ని పరిశీలిస్తున్న వేమిరెడ్డి, తదితరులు

దుత్తలూరు: దుత్తలూరులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ధ్యాన ముద్రలో ఉండే విగ్రహంతో నిర్మించిన వైఎస్సార్ ధ్యానమందిర నిర్మాణం బాగుందని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం దుత్తలూరులోని మేకపాటి రాజగోపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఆయన సమీపంలోని వైఎస్సార్ ధ్యానమందిరాన్ని చూసి మందిరం నిర్మాణం చేసిన దొంతిరెడ్డి జయసింహారెడ్డిని అభినందించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి మందిర విషయం తీసుకెళ్లి ఈ మందిరం ప్రారంభోత్సవానికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు కొడవలూరు ధనుంజయరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనరు అన్నంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చేజర్ల సుబ్బారెడ్డి, ఎల్‌పీ కొండారెడ్డి, దేవరపాటి సురేంద్ర, చుండి చైతన్య, బంకా వెంగళరెడ్డి, పలు మండలాల నాయకులు పాల్గొన్నారు.

చెరువులో భవన నిర్మాణం

ఆత్మకూరురూరల్: మండలంలోని నబ్బీనగరం చెరువు వద్ద ఓ భవన నిర్మాణం చేపట్టగా పంచాయతీరాజ్ అధికారులు అడ్డుకున్నారు. నబ్బీనగరం గ్రామానికి చెందిన ఓ కుటుంబం చెరువులో చేపలు పట్టుకునేందుకు అనుమతులు పొందారు. అయితే అక్కడ చేపల దాణా కోసం ఓ షెడ్డు నిర్మాణానికి ఉపక్రమించారు. గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆత్మకూరు ఈఓఆర్‌డీ ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి రేవూరు అంకయ్య చెరువు ప్రాంతానికి చేరుకుని ఇరిగేషన్ శాఖ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ఆదేశించారు. వెంటనే అనుమతుల్లేని నిర్మాణాన్ని నిలిపివేయాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పార్టీకి కార్యకర్తలే కొండంత బలం



వేమిరెడ్డి, మేకపాటిని గజమాలతో సత్కరిస్తున్న చేజర్ల సుబ్బారెడ్డి, తదితరులు

- వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతల ఆత్మీయ సమావేశంలో వేమిరెడ్డి

ఉదయగిరి: ఏదైనా ఒక పార్టీకి కొండంత బలం కార్యకర్తలేనని, పార్టీ మనుగడ సాధించాలంటే నేతలు, కార్యకర్తల ఆదరాభిమానాలు ఎంతో అవసరమని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఉదయగిరిలోని చేజర్ల సుబ్బారెడ్డి నివాసంలో శుక్రవారం సాయంత్రం నియోజకవర్గ ముఖ్య నేతలతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చూడాలని ప్రతి ఒక్కరూ ఎంతో కసితో పని చేశారన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో కూడా నేతలు, కార్యకర్తల మధ్య స్పర్థలు మనస్సులో పెట్టుకోకుండా కలిసి పనిచేసి మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాలన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు కొంత ఆర్థికంగా ఇబ్బంది పడినా ఆ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానన్నారు. తాను పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తున్నందున ఇక్కడి ప్రజల బాగోగులు చూసుకోవాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఇబ్బంది ఎదుర్కొన్న నేతలు, కార్యర్తల సమస్యలు తీరుస్తానని భరోసా ఇచ్చారు. ఎలాంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి గానీ, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి దృష్టికి గానీ, లేదా నియోజకవర్గ పరిశీలకుడు కొడవలూరు ధనుంజయరెడ్డి దృష్టికి తీసుకొస్తే తామందరం కలిసి ఆ సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మళ్లీ ఉదయగిరి, నెల్లూరు పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. సమన్వయకర్త రాజారెడ్డి మాట్లాడుతూ తాను బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నియోజకవర్గంలో అన్ని మండలాలు తిరిగానన్నారు. అక్కడ ప్రజల బాగోగులు, సమస్యల గురించి తెలుసుకున్నానన్నారు. నా వల్ల ఎలాంటి పొరపాట్లు ఉన్నా సరి చేసుకుంటానని తెలిపారు. 2019 ఎన్నికల్లో పని చేసిన విధంగానే ప్రతి ఒక్కరూ వచ్చే ఎన్నికల్లో కూడా పనిచేయాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు కొడవలూరు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ పరంగా కొంత సమస్యలు ఉన్న మాట వస్తావమేనని, కానీ పరిష్కరించుకోలేనంత పెద్దది కాదన్నారు. ఎవరికి ఏ సమస్య ఉన్నా మనస్సులో పెట్టుకోకుండా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు మౌనంగా ఉంటే అది పార్టీకి నష్టం కలిగిస్తుందని గుర్తు చేశారు. కొంతమంది వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు మౌనం వీడి పార్టీ విజయంలో కీలకంగా వ్యవహరించాలని కోరారు. సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించే బాధ్యత తన భుజాలపై వేసుకుంటానన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్స్ ప్రారంభం



నేరేడుపల్లిలో ప్లాంటు ప్రారంభిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మేకపాటి రాజారెడ్డి



నల్లబోతులవారిపల్లెలో మహిళకు నీటి బిందె అందిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మేకపాటి రాజారెడ్డి

వరికుంటపాడు/ఉదయగిరి: వరికుంటపాడు మండలం నల్లబోతులవారిపల్లె కాలనీ, ఉదయగిరి మండలం కుర్రపల్లి, వింజమూరు మండలం నేరేడుపల్లిలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్లను ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ 2017 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 115 మినరల్ వాటర్ ప్లాంట్లు ప్రారంభించగా అందులో 30 ఉదయగిరి నియోజకవర్గంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్లాంట్ల నిర్వహణ, మరమ్మతులు ఫౌండేషనే చూసుకుంటుందని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, పార్టీ ముఖ్య నేతలు కొడవలూరు ధనుంజయరెడ్డి, చేజర్ల సుబ్బారెడ్డి, దుగ్గిరెడ్డి గురవారెడ్డి, జెడ్పీటీసీలు సభ్యుడు ఆర్.నాగేంద్ర, గణపం బాలకృష్ణారెడ్డి, మోది రామాంజనేయులు సొసైటీ అధ్యక్షుడు జి.రామాంజనేయులు, సర్పంచ్‌లు కల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి, బండారు రమణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు సీఎం ఓబుల్‌రెడ్డి, డైరెక్టర్ జె.శ్రీనివాసులరెడ్డి, వైస్ ఎంపీపీ డి.మధు, మాజీ ఏఎంసీ చైర్మన్ అలీఅహ్మద్, ఎంపీడీఓ సీహెచ్ శ్రీదేవి, పార్టీ నేతలు అల్లూరురాజు, పల్లాల కొండారెడ్డి, మద్దూరు బాబు, రేవునూరు శ్రీనివాసులురెడ్డి, బయ్యపురెడ్డి విజయకృష్ణారెడ్డి, అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, కాలేషా, ఎం.తిరుపతినాయుడు, ఏ బాలగురవారెడ్డి, డి.ఎర్రాఓబయ్య, బి.వెంకటరత్నం, చెన్నారాయుడు, కె.వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

- జేసీ కూర్మనాథ్



ఆదూరుపల్లిలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జేసీ కూర్మనాథ్

చేజర్ల: యువత క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకుని క్రీడల్లో రాణించాలని జేసీ రోణంకి కూర్మనాథ్ అన్నారు. మండలంలోని ఆదూరుపల్లి క్రికెట్ మైదానంలో శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను పరిశీలించారు. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. గ్రామీణ క్రీడాకారులు తమ సత్తా చాటేందుకు ఆడుదాం ఆంధ్రా వేదికగా ఉపయోగపడుతుందన్నారు. తమ ప్రతిభను ఈ క్రీడల ద్వారా నిరూపించుకోవచ్చన్నారు. అనంతరం కాసేపు సరదాగా క్రికెట్ ఆడారు. శుక్రవారం సాయంత్రం యనమదల, ఆదూరుపల్లి క్రికెట్ జట్ల మధ్య సాగిన ఉత్కంఠ పోరులో ఆదూరుపల్లి జట్టు మండల విజేతగా నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆదూరుపల్లి జట్టు నిర్ణీత ఓవర్లలో 129 పరుగులు చేసింది. యనమదల జట్టు 61 పరుగులకే ఆల్ అవుట్ అయింది. విజేతగా నిలిచిన ఆదూరుపల్లి జట్టును పలువురు క్రీడాకారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణ, ఎంఈఓలు కళాధర్, మస్తానయ్య, స్పెషల్ ఆఫీసర్ సత్యానారాయణ, మండల స్పోర్ట్స్ కోర్డినేటర్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఉపాధ్యాయ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ పుష్పరాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు పీజీటీ జీవశాస్త్రం, భౌతికశాస్త్రం పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 19వ తేదీ లోపు దరఖాస్తులు దాఖలు చేసుకోవాలన్నారు. ఉప విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో ఎంపిక విధానం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 8712625047 నంబరులో సంప్రదించాలని కోరారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యాలయాలకు సెలవులు ప్రకటించడంతో ప్రభుత్వ, కొన్ని ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలు పాటిస్తుంటే.. పట్టణంలోని రెండు ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులకు సెలవులు ఇవ్వకకుండా తరగతులు నిర్వహిస్తున్నాయని ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి నాయకులు ఆరోపించారు. పట్టణంలో శుక్రవారం పలు ప్రైవేట్ పాఠశాలలను సందర్శించారు. రెండు పాఠశాలలు తరగతులు నిర్వహించడంపై పాఠశాల ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు పరిశీలించి సెలవుల నిబంధనలు భేఖాతరు చేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అంబేడ్కర్ ఆశయాలు నెరవేరుద్దాం

- సామాజిక సమతా సంకల్ప మానవహారం



ర్యాలీగా సాగుతున్న ప్రభుత్వ ఉద్యోగులు, నాయకులు

ఆత్మకూరు: భారత రాజ్యాంగ రచయిత, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చేందుకు అందరు సమష్టిగా కృషి చేయాలని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ బల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సామాజిక సమతా సంకల్ప మానవహారం నిర్వహించారు. తొలుత మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద మానవహారం నిర్మించారు. ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, తదితరులు మాట్లాడుతూ అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, ఉల్సా పెంచలయ్య, లాయర్ నందా ఓబులేసు, ఎన్‌జీఓలు వాగాల శ్రీహరి, ఎస్. పెంచల నరసయ్య, మున్సిపల్ ఆర్‌ఐ సయ్యద్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న గృహ నిర్మాణశాఖ అధికారుల

సోమశిల: సోమశిల జగనన్న కాలనీల్లో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారులను హౌసింగ్ డీఈ షేక్ ముక్తార్ బాషా ఆదేశించారు. అనంతసాగరం మండలం సోమశిలలో నిర్మిస్తున్న జగనన్న కాలనీ ఆయన శుక్రవారం పరిశీలించారు. బేస్ మట్టం వరకు పనులు చేసి ఆపేసిన వైనంపై డీఈ ఆరా తీశారు. కాలనీలో నీటి సదుపాయం లేకపోవడంతో పనులను నిలిపి వేశామని తెలిపారు. హౌసింగ్ ఏఈ శరత్‌చంద్ర, నాయకులు ముక్కు మస్తాన్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా సంక్రాంతిని నిర్వహించుకోండి

ఆత్మకూరు: భోగి, సంక్రాంతి, కనుమ పండగలను ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతంగా సంతోషంగా జరుపుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ ఎన్ కోటారెడ్డి అన్నారు. పండగలను పురస్కరించుకుని పేకాట, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించవద్దని, వాటిని ఎవరూ ప్రోత్సాహించరాదన్నారు. అనుమానిత గ్రామాల్లో, ప్రాంతాల్లో పోలీస్ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో సంఘ, సామాజిక వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సాగునీటి వినియోగంలో పొదుపు పాటించండి

ఆత్మకూరురూరల్: సోమశిల ఉత్తర కాలువ ద్వారా అందజేస్తున్న సాగునీటిని అధికారుల సూచనలకు అనుగుణంగా సద్వినియోగం చేసుకుంటూ పొదుపు పాటించాలని సోమశిల ప్రాజెక్ట్ ఏఈఈ పరమేశ్వరరెడ్డి, ఆత్మకూరు ఏఓ కిషోర్ బాబు తెలిపారు. మండలంలోని మహిమలూరులో శుక్రవారం మహిమలూరు, రామస్వామిపల్లి, బసవరాజుపాళెం, నారంపేట, తదితర గ్రామాల రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ వర్షాభావం పరిస్థితుల కారణంగా సోమశిల జలాశయంలో నీటి మట్టం గతేడాది కంటే తగ్గిందన్నారు. రానున్న వేసవి కాలంలో ఎలాంటి నీటి ఎద్దడి తలెత్తకుండా రైతులతో పాటు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో మహిమలూరు సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, వీఆర్‌ఓ సూరిపోగు కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి పల్లవోలు భాస్కర్, మహిమలూరు, రామస్వామిపల్లి పంచాయతీలకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.